నిండా ముంచుతోంది

- మామిడికి మంచు దెబ్బ
- ఆశించిన స్థాయిలో కనిపించని పూత
- దిగుబడి తగ్గే అవకాశాలు
- ఆందోళనలో రైతులు


గోకవరం మండలంలో సాగవుతున్న మామిడి.

గోకవరం: మామిడికి మంచు దెబ్బ తగిలింది. ప్రస్తుతం రాత్రి సమయంలో విపరీతమైన మంచు కురుస్తుండడంతో పూతపై ప్రభావం చూపింది. నవంబర్ నుంచి పూత రావాల్సి ఉండగా ఈ ఏడాది జనవరి వచ్చినప్పటికీ పూతకు నోచుకోలేదు. దీంతో దిగుబడిపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నియోజకవర్గంలో జగ్గంపేట, గోకవరం, గండేపల్లి మండలాల్లో మామిడి సాగువుతోంది. వీటిలో జగ్గంపేటలో సుమారు 800 హెక్టార్లలో, గోకవరం మండలంలో 1313 హెక్టార్లలో, గండేపల్లి మండలంలో 450 హెక్టార్లలో రైతులు మామిడిని పండిస్తున్నారు. గోకవరం మండలంలో రంపయర్రంపాలెంలో అత్యధికంగా 495 హెక్టార్లు సాగవుతుండగా వెదురుపాక, తిరుమలాయపాలెం, గోకవరం, కృష్ణునిపాలెం పంచాయతీల పరిధిలో మామిడి సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా బంగినపల్లి, కలక్టర్, చెరకు రసాలు, కొత్తపల్లికొబ్బరి తదితర రకాలను పండిస్తుంటారు. ఇక్కడ పండించిన పండ్ల రకాలను ఏటా మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బరంపురం, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. గతేడాది డిసెంబర్ నెలాఖరుకు మామిడి పూత విరబూయగా ఈ యేడాది ఆశించిన స్థాయిలో పూత లేదు. వచ్చిన కొద్దిపాటి పూత కూడా తేనెమంచు ప్రభావంతో మాడిపోతుంది. గతేడాది దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో నష్టాల బాట పట్టిన రైతులు ఈ ఏడాది దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు. కానీ తేనెమంచు ఆందోళనకు గురి చేస్తుంది. మంచు ఎక్కువగా కురుస్తుండడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పూతపై ప్రభావం చూపిస్తోంది.

ఆందోళనలో కౌలు రైతులు

నియోజకవర్గంలో మామిడి తోటలను కౌలు రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాను సుమారు 20 వేలు వరకు కౌలుకు తీసుకుంటున్నారు. అలాగే సుమారు రూ.10 వేలు వరకు మందుల కోసం ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే తోటలకు మందులు పిచికారీ చేసి సస్యరక్షణ చర్యలు చేపట్టారు. అయితే ఇప్పటికే గోకవరం మండలంలో హార్టీకల్చర్ అధికారులు సస్యరక్షణపై రైతులకు సూచనలిస్తున్నారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు

- మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తుండడంతో పూత రాలిపోయే ప్రమాదం ఉంది. తోటలకు నీరు పెట్టకూడదు, కలుపు తీసుకుని శుభ్రంగా ఉంచుకోవాలి.
- మామిడి తోటలు పూత మొగ్గ దశలో ఉంటే తేనె మంచు పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలీటర్లు, క్లోరోథలోనిల్ 2 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.


తిరుమలాయపాలెంలో రైతులకు సూచనలిస్తున్న హార్టికల్చర్ అధికారులు

ఎకరానికి నాలుగు బుట్టలు



పండు ఈగ నివారణకు పండు ఈగలను ఆకర్షించే బుట్టలను ఎకరానికి నాలుగు చొప్పున పెట్టుకోవాలి. రెండు లీటర్ల నీటికి 200 మిల్లీలీటర్ల బెల్లం పాకం, 5 మిల్లీలీటర్లు మలాతిన్, 100 మిల్లీలీటర్లు పులిసిన కల్లు కలిపిన ఎర మందును ప్లాస్టిక్ పళ్లెంలో 250 మిల్లీలీటర్లు చొప్పున పోసుకుని తోటల్లో అక్కడక్కడా ఉంచుకోవడం ద్వారా ఈగలు ఆకర్షించి చనిపోతాయి.

– రిని, హార్టీకల్చర్ అధికారి, కోరుకొండ

మంచు ప్రభావం ఎక్కువే..



ప్రస్తుతం మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో విపరీతమైన మంచు కురుస్తుండడంతో మామిడి పూతపై ప్రభావం చూపుతోంది. ఈనెలాఖారు నాటికి పూత పూర్తిస్థాయిలో వస్తే దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుందని ఆశిస్తున్నాం.

– కొరిపల్లి అప్పలస్వామి, మామిడి రైతు, గోకవరం

- మామిడి తోట పచ్చిపూత దశలో ఉంటే తేనెమంచు పురుగు, బూడిద తెగులు నివారణకు థయామిథాక్సమ్ 0.3గ్రాములు లేదా బుప్రోఫెజిన్ 1.5 మిల్లీలీటర్లు, హెక్సాకోనజూల్ 2 మిల్లీలీటర్లు లేదా కార్బండజిమ్స్, మాంకోజెబ్ కలిపి 2 గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి


మామిడి చెట్టు నీడలో వంటలు చేసుకుంటున్న భక్తులు

గండేపల్లి: మురారి మామిడితోటల్లో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి నెలకొంది. సెలవు దినం కావడంతో ఉద్యోగులు, తదితరులు కుటుంబ సమేతంగా వాహనాలపై తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుని వంటవార్పు చేసుకుని అక్కడే భోజనాలు చేసి సాయంత్రం వరకు మామిడితోటలో గడిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

మహిళలకు కుట్టు శిక్షణ


తుని రోటరీ క్లబ్ భవనంలో శిక్షణను ప్రారంభించిన రోటరీ ప్రతినిధులు

తుని: మహిళలకు స్వయం ఉపాధికల్పనకు రోటరీక్లబ్, కోల్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన హై స్పీడ్ లాక్ స్టిచ్ కుట్టు మెషీన్ల శిక్షణను ఆదివారం రోటరీక్లబ్ భవనంలో ప్రారంభించామని తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి 13 మందిని ఎంపిక చేశామన్నారు. కోల్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్స్, రోటరీ డిస్ట్రిక్ ఫండ్ రూ.2.90 లక్షలతో 13 హైస్పీడ్ లాక్ స్టిచ్ కుట్టు మెషీన్లను కొనుగోలు చేసి వారం రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఉచితంగా మెషీన్లను అందజేస్తామన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి ఎస్.వీర్రాజు, కోశాధికారి కిశోర్ రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ ఈశ్వర గణేష్, నాగ సురేష్, చెక్కా శ్రీనివాస్, మధుసూధన్, ప్రసాద్, రామచంద్రారావు, వివేకానంద, ఉమా శంకర్ సాయి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రైతులకు మొక్కజొన్న విత్తనాల పంపిణీ


గోపాలపురంలో రైతులకు మొక్కజొన్న విత్తనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గోకవరం: గోపాలపురం గ్రామంలో రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు, రసయనాలను పంపిణీ చేశారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమ, పయనీర్ మొక్కజొన్న విత్తనాల కంపెనీ, కొర్టివా రసాయనాల కంపెనీలు సంయుక్తంగా ఆదివారం మొక్కజొన్న ఉత్పత్తిని పెంచే ఉద్దేశ్యంతో గ్రామంలో రైతులకు మొక్కజొన్న విత్తనాలు, రసాయనాలు పంపిణీ చేశారు. అలాగే సాగు పద్ధతిలో మొళకువలను పెద్దాపురం మొక్కజొన్న పరిశోధనా కేంద్రం అధికారి హఫీజాపర్వీన్ వివరించారు. ఈ కార్యక్రమంలో అయా సంస్థల ప్రతినిధులు వివేక్, నాగేంద్రబాబు, స్థానిక రైతులు కోమలి విజయేంద్రనాథ్, తొట్టా వెంకటపతి, రమేష్, తుపాకుల రామకృష్ణ, చింతల కాపు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


చేపూరు జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన టైర్లు

తుని రూరల్: సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని వివిధ పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికుల ప్రమాదాలు నివారించేందుకు రూరల్ పోలీసులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి పర్యవేక్షణలో జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్లలో రక్షణ కవచాలు ఏర్పాటు చేశారు. టైర్లకు, పీపాలకు రంగులు వేసి ప్రమాదాల నివారణకు అనువుగా ఏర్పాటు చేశారు. మండలంలో తేటగుంట, టి.తిమ్మాపురం, చేపూరు, వేలంపేట వైజంక్షన్, జగన్నాథగిరి జంక్షన్లలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, వాహనదారులు ఇళ్లకు సురక్షితంగా చేరాలన్న ఆశయంతో రక్షణ చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే సీసీ కెమెరాలు, సిగ్నల్ బ్లింకింగ్ లైట్లు ఉన్నాయన్నారు. వీటిని గమనించి ప్రయాణాలు సురక్షితంగా చేయాలని ఎస్సై కృష్ణామాచారి సూచించారు. వాహనాలు నడిపేవారుతో పాటు వెనుక కుర్చున్న వ్యక్తులు సైతం హెల్మెట్ ధరించాలన్నారు.

సుపథ ప్రతిభా పరీక్షలు

తుని: విద్యార్థి దశ నుంచి పిల్లల్లో మాతృభాష, సంస్కృతి, సంప్రదాయం, మానవతా విలువలు పెంపునకు సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని సంస్థ ప్రతినిధి యూవీఏఎన్ రాజు అన్నారు. ఆదివారం తుని బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షకు 9 పాఠశాలలకు చెందిన 289 విద్యార్థులు హాజరయ్యారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత కేటగిరిల్లో పఠనం, పద్య, గేయ, వేద పఠనం, తెలుగు నేర్చుకుందాం, వ్యాసరచన, రామాయణం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయం, నైతిక విలువలను పెంపునకు సుపథ సంస్థ కృషి చేస్తోందని నిర్వాహకులు ఏవీఎస్ ప్రకాశం అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.నూకరత్నం, ఎస్.భానుమతి, మంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు


గోకవరంలో చిన్నారుల పూజ

గోకవరం: స్థానిక శ్రీవాసవికన్యకా పరమేశ్వరి మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణం మండపంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చిన్నారులకు రేగుపండ్లు, పూలతో భోగి పండ్లు వేసి హారతులు ఇచ్చారు. సాంప్రదాయ బద్ధంగా గొబ్బిళ్లు పెట్టి పాటలు పాడారు. అర్చకులు కిట్టు శర్మ, చైతన్యశర్మల ఆధ్వర్యంలో చిన్నారులతో సంక్రాంతి పూజ నిర్వహించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

వైభవోపేతంగా శ్రీలక్ష్మీనారాయణ హోమం

తుని రూరల్: టి.తిమ్మాపురం శివారు విష్ణుపురం మహావిష్ణు దేవస్థానంలో వైభవోపేతంగా శ్రీలక్ష్మీనారాయణ హోమం, పూర్ణాహుతి జరిగింది. ఆదివారం ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త పోల్నాటి శేషగిరారావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రదీప్‌శర్మ హోమం నిర్వహించారు. కట్టా శ్రీనివాసరావు, వీరసత్యవతి, రావి విష్ణుచక్రం, మధుపావనీ, గుండుబిల్లి త్రిమూర్తులు, విష్ణు శివకుమారి దంపతులు పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వెలమకొత్తూరు గ్రామానికి చెందిన బృందం ఆధ్వర్యంలో భజనలు, సంకీర్తన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈనెల పదిన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనాలు ఏర్పాటు చేసినట్టు ధర్మకర్త శేషగిరిరావు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తుని: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 10 తేదీల్లో రిటైల్ విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ, బృందావనకాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్, 10న కర్నూల్ కమిషన్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించి సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకుంటారని చెప్పారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ స్థానిక విద్యుత్ ఆపరేషన్ ఈఈ కార్యాలయాన్ని సంప్రదించి. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణలో కూడా హైబ్రిడ్ విధానంలో మూడు రోజుల పాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. ఈ ధరలపై సందేహాలు, సలహాలు సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులు ఎవరైనా పాల్గొనవచ్చని డీఈ బి.వీరభద్రరావు తెలిపారు.

నేటి నుంచి పింఛన్ల తనిఖీ

గండేపల్లి: మండలంలో సోమవారం నుంచి వైద్య బృందాలు పింఛన్ల తనిఖీ కార్యక్రమం చేపడతారని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. నెలకు రూ.15,000, రూ. 6,000 పింఛను పొందుతున్న లబ్ధిదారులను మాత్రమే తనిఖీ చేస్తారన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందాలు వచ్చి మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, దివ్యాంగులు దగ్గరలోనిప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేస్తారని తెలియజేశారు. అందుబాటులో లేని లబ్ధిదారుల పెంఛన్లను హోల్డ్‌లో ఉంటాయని తెలిపారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన


ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికుల కార్మికుల నిరసనలో భాగంగా ఆదివారం ప్రత్తిపాడులో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అల్లూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అల్లూరి విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరావు మాట్లాడుతూ అర్ధాంతర జీడిపిక్కల పరిశ్రమను మూసివేస్తే కార్మికుల భవితవ్యం ఏమిటని ప్రశ్నించారు. పరిశ్రమను తెరిపించి, ఉపాధి కల్పించమంటే కార్మికులపై అక్రమంగా కేసులు బనాయించడం సరికాదన్నారు. కేసులు పెట్టి భయపెడితే వెనుకంజ వేసేది లేదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికుల న్యాయపోరాటానికి సీఐటీయూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని జీడిపిక్కల పరిశ్రమను తెరిపించాలని, లేదా ప్రభుత్వమే నడపాలని రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో వల్ల తుని, రాజమహేంద్రవరం, కాకినాడలవైపు రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో పరిశ్రమ కార్మిక సంఘ నాయకులు అనిశెట్టి వీరబాబు, కె.చక్రధర్, కృష్ణారావు, ఎం.శివ, అత్యుతరామయ్య, శేషు, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, సత్య తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై పట్టు సాధించాలి

ఏలేశ్వరం: భగవద్గీతపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలని విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరీటి అన్నారు. ఇటీవల భగవద్గీత పోటీల్లో రెండో బహుమతి సాధించిన ఉమాదేవిని స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిరీటి మాట్లాడుతూ భగవద్గీత ద్వారా భక్తిభావం పెరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భగవద్గీతకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో గిరిజా కుమారి, రేవతి, ఇంధిర, సౌజన్య, దేవి తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో ఉమాదేవిని సత్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

పెద్దిపాలెంలో ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: పెద్దిపాలెం గ్రామ శివారులలో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సారా స్థావరాలపై దాడులు నిర్వహించిన ఈదాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు.

మూడు వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెంలో సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి వినియోగించే మూడు వేల లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 140లీటర్లు సారా, 225 కిలోల నల్లబెలంను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ ఎస్ఐ శాస్త్రి తెలిపారు.

భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

- వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ
- భక్తులను ఇబ్బందికి గురి చేసిన సిబ్బందిపై చర్యలు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తులకు స్వామివారి దర్శనం, వ్రతం, వివిధ సేవల్లో ఎదురైన ఇబ్బందులు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను ఐవీఆర్ఎస్ పద్ధతిలో సేకరించి, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దేవదాయ, ధర్మదాయశాఖ నిర్ణయించింది. దేవదాయశాఖ కమిషనర్, ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయం తెలిపారు. సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎక్కడైనా ఇబ్బంది ఎదురైందా, సిబ్బంది లేదా అర్చకులు, పురోహితులు ఎటువంటి కానుకలైనా డిమాండ్ చేశారా అనే దానిపై ప్రశ్నల రూపంలో అడగనున్నారు. దీనికి అవునైతే ఒకటి, కాదంటే రెండు నొక్కి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా సేవా టిక్కెట్లు కొనుగోలు చేసినవారు, గదుల రిజర్వేషన్ చేయించుకున్న భక్తుల ఫోన్ నంబర్లు సేకరించి నేరుగా కమిషనర్ కార్యాలయం నుంచే వారికి ఫోన్ చేసి ఈ వివరాలు సేకరిస్తారని అధికారులు తెలిపారు. వీరితోపాటు స్వామివారి ఆలయానికి విచ్చేసే భక్తుల ఫోన్ నంబర్లు పది సేకరించి కమిషనర్ కార్యాలయానికి ప్రతిరోజూ పంపించాల్సి ఉంటుంది. ఆ భక్తులకు కాల్ చేసి ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరిస్తారు. ఒకవేళ ఏ భక్తుడైనా తాను చాలా ఇబ్బంది పడినట్టు చెబితే ఆ భక్తుని నుంచి పూర్తి సమాచారం సేకరించి అందుకు బాధ్యులైన వారిపై తగు చర్య తీసుకోవాలని దేవస్థానం అధికారులను ఆదేశిస్తామని ఆ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ చెప్పినట్టు అధికారులు వివరించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి పూజలు

కిర్లంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిర్లంపూడిలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మురళీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు, సుదర్శన చక్రానికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వరి కుప్పల దగ్ధం


తొండంగి సమీపంలో పొలంలో కాలిపోతున్న వరికుప్పలు

తొండంగి: గ్రామ శివారులో ఇద్దరి రైతులకు చెందిన వరి కుప్పలు ఆదివారం దగ్ధమయ్యాయి. బాధితులు పి.వెంకటరమణ, పి.సత్తిబాబు అన్నదమ్ములు ఇద్దరు తుని మండలం హెచ్.కొత్తూరు సమీపంలో పొలంలోని పంటను వరికుప్పలుగా వేసుకున్నారు. ఆదివారం ఉదయం వరికుప్పల నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు వీరికి సమాచారం అందించారు. వెంటనే తుని అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.కానీ అప్పటికే వరిచేను మొత్తం కాలిపోయింది. సుమారు నాలుగెకరాల పంట నష్టపోయినట్టు బాధితులు తెలిపారు. దాదాపు రూ.మూడు లక్షల నష్టపోయినట్టు వాపోయారు.

యువకుడి అదృశ్యం

గండేపల్లి: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని మురారికి చెందిన జె.నాగరాజు ఈనెల 3వ తేదీ రాత్రి 11 నుంచి కనిపించడంలేదని పలుచోట్ల వెతికినప్పటికీ ప్రయోజనంలేక పోవడంతో నాగరాజు బావ కె.పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలియజేశారు.

పశువుల పాక దగ్ధం


రౌతులపూడి: బలరామపురం గ్రామ శివారు వెంకయమ్మ చెరువు సమీపంలో గొల్లు నానాజీకి చెందిన పశువుల పాక ఆదివారం దగ్ధమైంది. పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత పాక దగ్ధమైనట్లు సమాచారం అందింది. దీంతో తిరిగి పొలంలోకి వెళ్లి చూడగా పాకపై మంటలు ఎగిసి పడుతున్నాయి. పాక పూర్తిగా కాలి బూడిదైంది అని బాధితుడు వాపోయాడు. పాకలో వ్యవసాయానికి ఉపయోగించే ఎడ్ల బండి, వ్యవసాయ పరికరాలు, గృహోపకరణకు సంబంధించి కర్ర, సైకిల్, ఇతర పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిపినట్టు బాధితులు తెలిపారు.

విజయవాడ తరలిన హైందవ సైన్యం

ప్రత్తిపాడు: విజయవాడలో జరిగే విజయ శంఖారావం మహాసభకు ప్రత్తిపాడు నుంచి ఆదివారం విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ, జనసేన తదితర కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. స్థానిక మినర్వా కళాశాల సమీపంలోని మైదానం వద్ద హైందవ శంఖారావం బస్సులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. రాచపల్లి శ్రీరమణాశ్రమం స్వామీజీ రామానంద, బీజేపీ నాయకులు ఊటా వీరబాబు, చిట్రా పాపారావు, ఈర్ల దేవి, కించు జోగిరాజు, ఎనుముల రాజా, గున్నాబుత్తుల రాజబాబు తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.


గండేపల్లిలో..

గండేపల్లి: దేవాలయల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన హైందవ శంఖారావానికి మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలం నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. భారతీయ ధర్మపరిషత్, బజరంగబలి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో హిందువులు భారీగా తరలివెళుతున్న వాహనాలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జెండా ఊపి ప్రారంభించారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఈ సభలు జరుగుతున్నాయని, ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.


ప్రత్తిపాడులో జెండా ఊపి ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రావు

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా ఉన్న హైందవ సైన్యం ఆదివారం విజయవాడకు తరలివెళ్లింది. బీజేపీ, జనసంఘ్ ఆధ్వర్యంలో ఏలేశ్వరం, యర్రవరం నుంచి రెండు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లా శ్రీనివాసరావు, వాహన ప్రముఖ్ కానూరి లచ్చబాబు, సంఘ్ మండల అధ్యక్షుడు ఏనుగు సుబ్రహ్మణ్యం, కోట వీరమహేశ్వరరావు, తోట రాఘవ రావు తదితరులు పాల్గొన్నారు.


యర్రవరం నుంచి విజయవాడకు బయలుదేరిన హైందవ నాయకులు